# ఏకాకి



దూరాన కొండలపైనుంచీ, ఊరిచుట్టూ టెంకాయతోటలపైనుంచీ, కోనేటి కెరటాలపైనుంచీ మందమారుతం, చల్లగా వీస్తూ ఏడు కొండలెక్కి అలసిపోయిన యాత్రికులకు హాయి కలుగజేస్తోంది. బంగారు కోనేటి మధ్య నాలుగు కాళ్ళ మండపంలోనూ,కోనేటి కటువైపున రావిచెట్టు రెమ్మల్లోనూ, ఇటు దేవాలయ గోపురంలోనూ విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. పాలార బోసినట్టు నింగినుండి నేలకు వ్యాపించిన వెన్నెల, విద్యుద్దీపాల వెలుగు ముందు తెల్లబోతోంది.

రఘునాధరావు కోనేటి నీటిలో బుడుంగున మునిగి పైకిలేచి, మెట్ల పైన కూచున్న భార్యని చూస్తూ "ఇంతమాత్రానికే భయపడతా వెందుకు సుశీ! తెంపుచేసి నీళ్ళల్లో మునిగేయాలంతే,మళ్ళీ చలీ, గిలీ ఏమీ వుండదు" అన్నాడు.

"నే నెప్పుడూ చన్నీటిలో స్నానం చేయలేదు బాబూ;నన్ను తొందర పెట్టకండి, మీకు పుణ్యముంటుంది" అంది సుశీల.

సుశీల ఒడిలో కూచున్న చిట్టిపాప మాత్రం,తల్లి గనుక తనని వదలి పెడితే ఒకసారి మెట్లన్నీ దిగి క్రింది మెట్టుపైన కూచుని నాన్నగారితోబాటే స్నానం చేయా లనుకుంది. ఓయబ్బో—ఒక్కసారిగా ఎందరు స్నానం చేస్తున్నా రీకోనేట్లో! అక్కడక్కడా కొందరు తల్లులేమో, నీళ్ళను చూచి పారిపోతున్న పిల్లల్ని బలవంతాన తీసుకొచ్చి నీళ్ళల్లో ముంచి బయటికి

పంపుతున్నారు. మరి అమ్మ మాత్రం తన నెందుకిలా వదలిపెట్టడంలేదు? చిట్టిపాప లేత బుర్రలో ఇలా ఆలోచనలు సాగిపోతున్నాయి.

రఘునాథరావు స్నానం ముగించి పైకి వచ్చి బట్టలు వేసుకున్నాడు. సుశీల చిట్టితో సహా పాదప్రక్షాళనం చేసుకుని, ముఖం కడుక్కుని మెల్లెక్కి పైకి వచ్చింది. భార్యా భర్త లిద్దరూ చిట్టిని చెరోవైపున పట్టుకుని దేవాలయం వైపు నడవసాగేరు.

"మరిప్పుడు టెంకాయ కొనుక్కో వద్దా నాన్నా!" అని హెచ్చరించింది చిట్టిపాప.

"దీని ధ్యాసెప్పుడూ టెంకాయపైన్నే నండీ!" అంది సుశీల.

"టెంకా యొకటే కాదు, పూలు కూడా కొనుక్కోవాలి. ఏం నాన్నా, కొనుక్కో వద్దూ?" అంది చిట్టిపాప.

"అన్నీ కొనుక్కుందాంలే పాపా! అంగళ్ళ దగ్గరికే వెళ్తున్నాంగా" అన్నాడు రఘునాథరావు.

ప్రాకారంముందు డబ్బారేకుల పాకల్లో టెంకాయలు రాసులు రాసులుగా అమ్ముడుబోతున్నాయి. రఘునాథరావు రెండు టెంకాయల కోసం ఐదు నిమిషాలు బేరం చేశాడు. కానీ అర్ధణాకోసం అదొక పట్టింపుగా భర్త బేరమాడుతూ బజారులో నిలబడడం సుశీల కాదినుంచీ అంత మనస్కరించే విషయం కాదు. అవసరాన్నిబట్టి వస్తువుకు కొంచెం అదనపు మూల్యం ముట్టజెప్పడానికి సుశీల ఎప్పుడూ వెనకాడదు. రూపాయల్ని చిల్లపెంకులుగా చూసే భారీ కుటుంబంలో పుట్టిన ఆడపడుచాయె మరి! ఆమెలో అంత మాత్రం దుబారా తత్వం ఉండడంలో ఆశ్చర్య మేముంది?

పరిస్థితులు కలిసిరావడంచేత రఘునాథరావు ప్రస్తుతం అణా కానీల కోసం అంత పట్టింపు చూపవలసిన అవసరం లేనిమాట నిజమే! కానీ అతడు లేమిలో పుట్టి-లేమిలో పెరిగాడు. ఇప్పటి సంగతంత గట్టిగా చెప్పలేం గానీ ఒకప్పు డతడు అణా కానీల విలువ బాగా ఎరుగును. రైలుచార్జీకొక అణా కొరతగా వుండడంవల్ల, అతడు పదేళ్ళ ఈడప్పు డొకనాడు

పదిమైళ్ళ దూరం నడిచాడు. సినిమాహాల్లో ప్రవేశించేందుకు రెండణాల డబ్బులకోసం అత డొకనాడు బస్సుస్టాండు దాకా ఒక బట్టల మూటని మోసుకెళ్ళాడు. కానీ అలా ఎంతోకాలం జరుగలేదు. రఘునాధరావు జీవిత పథం ఉన్నట్టుండి ఒకచోట మలుపు తిరిగింది. అది రఘునాధరావుకు అచ్చి వచ్చిన మలుపు! అదృష్టం చేకూర్చిన మలుపు!

టెంకాయలు చేతిసంచిలో వేసుకుని రఘునాధరావు సతీసుతలతో పూలంగళ్ళవైపు నడిచాడు. వేయికాళ్ళ మండపానికి ప్రక్కగా పెద్ద పెద్ద పూలంగళ్ళు బారులుతీరి వున్నాయి. గులాబీ పూల సరాలు అంగళ్ళముందు వ్రేలాడుతున్నాయి. మల్లెపూల మధుర సుగంధం మత్తెక్కిస్తోంది. రఘు నాధరా వక్కడ ఒక క్షణంసేపు ఆగి "ఏం పువ్వులు కొనుక్కోమంటావు సుశీ!" అని అడిగాడు.

"కదంబం కనబడదేమిటండీ ఇక్కడ?" అంది సుశీల.

చేమంతులు అందంగా ఉంటాయి. మల్లెపూలు కమ్మని వాసన వెద జల్లుతాయి. కనకాంబరాల సౌకుమార్యం మెచ్చుకోతగ్గది. ఐతే ఈ మూడింటి కలయికవల్ల అందం, సుగంధం, సౌకుమార్యం కలసిపోయిన కదంబం ఏర్పడుతుంది. సుశీలకు కదంబమంటే మహా యిష్టం!

రఘునాధరావు కదంబంకోసం చుట్టు ప్రక్కల కలయజూచాడు. అంగళ్ళకు కొంచెం దూరంలో ఒక ముసలావిడ పూలగంప ముందరుంచు కుని దండలమ్ము కుంటోంది. "అదిగో సుశీ, కదంబం" అంటూ అతడు అడుగు ముందుకు వేయబోయి అంతలో అక్కడే హఠాత్తుగా ఆగి పోయాడు.

"ఏమండీ! వెళ్ళి పూలు కొనుక్కుందాం. వేళ మీరిపోతోంది" అంది సుశీల.

"అది కాదు సుశీ! ఆ పూలమ్ముకుంటున్న దెవరో పరకాయించి చూడు" అన్నాడు రఘునాధరావు. అతడి కంఠంలో గాద్గద్యం సుశీలకు స్పష్టంగా వినిపించింది.

ముసలావిడని పోల్చుకోడానికి సుశీలకి ఒకటి రెండు నిమిషాలు కావలసి వచ్చాయి. ఆమె చేష్టలుడిగి బొమ్మలా భర్త ప్రక్కన నిలుచుండి పోయింది.

తల్లిదండ్రు లెందుకలా కొయ్యబారి పోయారో అర్థంగాక చిట్టిపాప సైతం తెల్లబోయింది.

దిగ్భ్రమలోనుంచి తేరుకున్న తర్వాత రఘునాధరావు సుశీల వైపు చూస్తూ "మమకారాలు గొప్పవే సుశీ! కానీ వాటికీ ఒక హద్దు ఉంది. ఆ హద్దు దాటిన తర్వాత మనిషిలో మమకారం నశించి నిర్లిప్తత నెలకొం టుంది. అందుకు ఆ ముసలావిడే సాక్షి" అన్నాడు.

ఎదుటివారి కష్టనష్టాలు సుశీల గ్రాహ్యశక్తికి ఎప్పుడూ అంత అందు బాటులో ఉండేవికావు. కానీ ఆ క్షణాన మాత్రం ఆమె కనుకొలకుల్లో రెండు కన్నీటి చుక్కలు నిలచాయి.

"ఏమంటావ్ సుశీ! ఈ పరిస్థితిలో ఆమె ఎదుట నిలబడగల మన స్థైర్యం మనలో ఎవరికీ లేదుగదూ!" అన్నాడు రఘునాధరావు.

ఉన్నట్టుండి సుశీల చిట్టిపాపని చేతుల్లో తీసుకుని "చూడు చిట్టీ! అదిగో మీ జేజెమ్మ" అంది. అడ్డకట్టను తొలగించుకుని ఈవలబడిన ప్రవాహ జలంలా ఆ మాటలు సుశీల లోపలినుంచీ ఆవేగంతో బయటికి వచ్చాయి.

చిట్టిపాప తల్లిచేతులు విదిలించుకుని, క్రిందికి జారి ఒక్కపరుగుతో ముసలావిడ దగ్గరికివెళ్ళి "జేజెమ్మా!" అంటూ ఆవిడ ఒడిలో వ్రాలింది. ఈ హఠాత్సంఘటన కాస్తా ముసలావిడకు సంభ్రమాన్నే కలిగించి వుండాలి మరి. ఆవిడ బిడ్డని హృదయానికి హత్తుకుంటూ, దృష్టిపాటవం కొఱవడిన కళ్ళతో ముందుకు తేరిపారచూస్తూ, దంపతుల్ని పోల్చుకొని "అక్కడే నిలబడ్డారేమర్రా! రండి రండీ" అని సాదరంగా వాళ్ళని ఆహ్వానించింది.

రఘునాధరావు ముందుకు నడిచాడు. సుశీల అతణ్ణి వెంబడించింది.

మనమడు అమ్మమ్మ కుడివైపున కూచున్నాడు. మనుమరాలు నాయ

"మార్పు రాకుంటే నువ్వు నన్ను వదలిపెట్టి యింతదూరం వచ్చే దానినా అమ్మమ్మా?" అన్నాడు రఘునాధరావు.

గుడిలో దేవుడి పూజ ప్రారంభమైనందుకు గుర్తుగా గంటలు మ్రోగాయి.

"ఐతే యాత్రకొచ్చినవాళ్ళు నా దగ్గరే కూచున్నారేమర్రా! రాకరాక సరిగ్గా శుక్రవారం చూచుకుని వచ్చారు. ఈ రోజు స్వామివారికి నగలన్ని టినీ అలంకరిస్తారు, చూడ్డానికి వెయ్యికళ్ళు కావాలి. వెళ్ళండి. మళ్ళీ తీరిగ్గా మాట్లాడుకుందాం. వెళ్ళవే చిట్టీ! వెళ్ళి దేవుణ్ణి చూచిరా" అంది బామ్మ.

రఘునాధరావు పైకిలేచాడు. సుశీల చిట్టిని తీసుకుని అతడి వెంట నడవసాగింది.

వాళ్లు పదడుగులు ముందుకు వేశారో లేదో ముసలావిడ సుశీలని కేక వేసి "అదేమిటే! నాకైతే అరవయ్యేళ్ళొచాయి. మతిమరపూ హెచ్చింది. నీకూ మరపైతే ఎలాగ! ఈ పూలుంచుకో తల్లో. నీకు కదంబ మంటే మరీ యిష్టం కదూ! ఇవిగో, ఈ పువ్వులు నీకు. ఇవి చిట్టికి. చిట్టికి కొంచెం ఎక్కువగానే వుండనీ, రెండు జడలు కదూ!" అంటూ పక్కన నవ్వింది.

* * *

అదొక పనిగా యిల్లాండ్రను వేపుకతినే యింటి యజమానులకోవకు చెందినవాడు కాదు సీతారామయ్య. అతడు భార్యని ప్రాణాధికంగా గాక పోయినా, ప్రాణ సమానంగా నయినా చూచుకుంటూ వచ్చాడు. ఆమెకు కావలసినన్ని నగలు చేయించాడు. ప్రతి పండుగకూ క్రొత్త చీర కొని పెట్టాడు. ఆమె ముద్దు ముచ్చటలు తీరదానికని ఆమె గర్భంగా వున్నప్పుడు సీమంతం పెళ్ళి చేయించుకున్నాడు. బిడ్డలు పుట్టిన తర్వాత వాళ్ళకి నామ కరణ మహోత్సవం భారీ ఎత్తున జరుపుకున్నాడు.

భర్త యిన్ని నగలు చేసిపెట్టినా, యిన్ని చీరలు కొనిపెట్టినా, బిడ్డ లకు నామకరణమని, అన్న ప్రాశనమనీ, అక్షరాభ్యాసమనీ అప్పుడప్పుడూ

కొన్ని పబ్బాలు చేస్తున్నా అవన్నీ తనకోసం కానట్టు సంచరించేది కామాక్షమ్మ. 'ఈ చీర ఎందుకు కట్టుకున్నావు కామాక్షమ్మా, ఈ పువ్వులే ఎందుకు పెట్టుకోవాలి కామాక్షమ్మా'-ఇలాటి ప్రశ్నలకు 'ఈ చీరంటే మా వారికిష్టం, ఈ పువ్వులంటే మా వారికి చాలా ప్రీతి'-ఇలాటి రెడీమేడ్ సమాధానాలు వచ్చేవి కామాక్షమ్మనుంచి. ఆమె ఏ పనిచేసినా భర్త సుఖంకోసం, భర్త తృప్తికోసం చేసింది. తనవంటూ కొన్ని స్వంత అభిప్రాయాలను, అభిలాషలను ఆమె ఎప్పుడూ ఏర్పరచుకోలేదు. సీతారామయ్య పూవైతే ఆమె తావి. పూవులేక తావి వుండదు. తావిలేని పువ్వు వుంటుంది. తావికి ప్రత్యేక వ్యక్తిత్వంలేదు.

తొలిచూలు మగబిడ్డ. మలిచూలేమో ఆడబిడ్డ. పుట్టిన బిడ్డ లిద్దరూ ఒక ఆకూ, దోకూ లేకుండా ఎదిగి చేతికొచ్చారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సీతారామయ్య ఆ యిద్దరికీ పెళ్ళిళ్ళుచేసి అంతటితో తన బాధ్యత తీరిపోయినట్టు ఒకానొకనాటి మధ్యాహ్న భోజనానంతరం ఈజీచేర్లో కూచున్న మనిషి కూచున్నట్టుగానే కళ్ళుమూసేశాడు.

భర్త మరణంతో కామాక్షమ్మకు యిహ లోకంతో సంబంధం తెగిపోయినట్టే తోచింది. కొడుకు సంసారాన్ని చక్కదిద్దుకుంటున్నాడు. వాడి చేతి క్రింద ఇరవై వేల రూపాయల బట్టల వ్యాపారం సాగుతోంది. ఇటీవల ఒక హోటలుకూడా ప్రారంభించాడు. పైగా కృష్ణమూర్తికి పిల్లనిచ్చిన మామగారు లక్షాధిపతులు! ఇక కూతురుంది. కామాక్షమ్మ ఎప్పుడు ఆలోచించినా ఆ కూతురుని గురించే ఆలోచించేది. అది నోట్లో నాలుకలేనిపిల్ల. అందుకు తోడు అల్లుడు వట్టి బోళాబాయి మనిషి. బొగ్గులనీ, కట్టెలనీ, ఎముకలనీ, ఏవేవో తలకు మించిన వ్యాపారాలుచేసి ఆస్తిని గుల్లచేస్తున్నాడు. దూరాభారం ప్రయాణం కావడంచేత అప్పుడప్పుడూ కుమార్తెని చూచిరావడానికి వీలు పొసగడంలేదు. తనెప్పుడో మనవడి కర్ణభూషణోత్సవానికని వెళ్ళి రెండు నెలలపాటు వుండివచ్చింది. ఆ మనవడి కీపాటికి నాలుగేళ్ళు దాటివుంటాయి. ఈ మహరాజేమో ఆ వ్యాపారమేమిటో, ఆ హోట

లేమిటో, వాడి మామగారి విరవాకా లేమిటో-అవి తప్పా చెల్లెలి సంగతే పట్టించుకోడంలేదు.

ప్రక్కింటి పంతులుగారిని, ఎదురింటి అబ్బాయిని బ్రతిమాలుకుని కామాక్షమ్మ నెలకొకసారైనా అన్నపూర్ణకు జాబు వ్రాయించేది. ప్రత్యుత్త రాలు చాలా నిరాశాజనకంగా వుండేవి. ఏదో చెప్పరాని బాధను హృద యంలో దాచుకుని కుమిలిపోతూ, ఆ బాధని వ్యక్తం చేయడానికి మాటలు స్ఫురించక వ్రాసిన నాలుగైదు పంక్తుల్లోనే కొండంత ఆవేదన వెళ్ళగక్కే అన్నపూర్ణని తలచుకుంటే కామాక్షమ్మ గుండె చెరువైపోయేది.

ఓ రోజు సాయంత్రం కృష్ణమూర్తి ఒక కాగితం చేతబట్టుకుని వంట గది దాకావచ్చి "అమ్మా! టెలిగ్రాం వచ్చింది" అన్నాడు. కామాక్షమ్మకు గుండె ఆగిపోయినంత పనైంది. ఆమె తేరుకునేలోపలే కృష్ణమూర్తి "బావకు ఒళ్ళు జబ్బుగావుందట! తక్షణం ఎవరినైనా బయల్దేరి రమ్మంటు న్నారు" అన్నాడు.

"అతడి కా జబ్బనేది మొదటినుంచీ వున్నదే కదరా! అదికాదులే. ఇప్పుడు మరీ పీకలమీది కొచ్చివుంటుంది. లేకుంటే టెలిగ్రా మెందు కొస్తుంది" అంటూ కామాక్షమ్మ కంగారు పడిపోయింది.

ఎప్పటిలాగే కృష్ణమూర్తి పనుల తొందరవల్ల ఇల్లు కదలి వెళ్ళలేక పోయాడు. కామాక్షమ్మ రాత్రి ఎనిమిదిగంటల మెయిల్లో బయల్దేరింది. మెయిల్ శరవేగంతో పరుగిడుతోంది. కుమార్తెకూ తనకూ మధ్య దూరం తగ్గనూ తగ్గనూ కామాక్షమ్మ, హృదయంలో ఆరాటం ఎక్కువ కాసాగింది. నిర్నిమిత్తంగా తనకలాటి ఆరాటమూ, ఆందోళన కలగదనీ, నిజాని కేదో అనర్థం జరిగిపోయే వుంటుందని ఆమె మాటిమాటికీ అనుకోసాగింది.

ఆమె అనుమానం అక్షరాలా నిజమే అయింది. కామాక్షమ్మ యిక్కడ రైలెక్కిన ఎనిమిది గంటలవేళకే అక్కడ అన్నపూర్ణ భర్త ఆఖరి శ్వాస విడిచి పెట్టాడు.

కామాక్షమ్మ కూతుర్ని కావిలించుకుని కన్నీరు మున్నీరుగా విల

పించింది. "ఇంత చిన్నతనంలోనే నీకూ నా రాతే పట్టిందే అన్నపూర్ణా!" అంటూ ఆక్రోశించింది.

ఆశ్చర్యమేమంటే అన్నపూర్ణ ఉలకలేదు, పలకలేదు. శోకరసాధి దేవతలా సాక్షాత్కరించిన తల్లిని సైతం ఆమె పోల్చుకుందో లేదో చెప్పడం కష్టం. ఆమె అరవిచ్చిన కళ్ళతో ప్రపంచాన్ని శూన్యంగా చూస్తోందంతే!

దగ్గరున్న వాళ్లు కామాక్షమ్మకు పరిస్థితిని వివరించి చెప్పారు. భర్త కాయిలా పడినప్పటినుంచీ రెండు మూడు నెలలుగా అన్నపూర్ణకు నిద్రాహారాలు సరిగ్గాలేవు. ఆహారం సంగతి ఎలావున్నా నిద్రమాత్రం బొత్తిగా లేదన్నా తప్పులేదు. అలా కంటికి రెప్పలా కాచుకుని వున్నప్పటికీ రోగి ప్రాణవాయువులు ఎప్పుడో బొందిని విడిచి పోయాయి. భర్త చనిపోయాడని తెలియగానే అన్నపూర్ణ శవంపైనపడి గుండె బద్దలై పోయేటట్టు ఏడ్చిమొత్తుకుంది. తల బాదుకుంది. ఆమెని ఊరడించడానికి ఎవరికీ సాధ్యంకాలేదు. తెల్లవారేవరకూ అలా ఏడుస్తూ వుండిపోయి, ఆ పైన ఆమె స్మారకం తప్పి క్రిందపడిపోయింది. ఉదయం తొమ్మిది గంటలప్పుడు బలవంతాన నోరు తెరచి పాలుపోశారు. దాంతో కొంచెం తెప్పరిల్లుకున్నా మళ్ళీ మామూలు మనిషి కాలేకపోయింది. ఎవరు మాట్లాడినా బిక్కరించి చూస్తుంది. బదులు మాట్లాడదు. ఎవరేమడిగినా బదులుచెప్పదు. ఏడవబోతుంది. గొంతు పెగలక మానేస్తుంది. అప్పుడప్పుడూ నవ్వుతుంది కూడా.

అల్లుడి చావు గోరుచుట్టయితే, కూతురి పిచ్చివాలకం ఆ గోరుచుట్టు పైన రోకటిపోటులా తయారైంది కామాక్షమ్మకు!

ఆ సాయంత్రం శవ దహనం రివాజు మేరకు జరిగిపోయింది. తరువాతి కర్మకాండలు సైతం యథావిధిగా జరిగిపోయాయి. కాలం యథాప్రకారం గడచిపోతూనే ఉంది. కానీ అన్నపూర్ణలో మాత్రం మార్పు రాలేదు. మెడలోనుంచి మంగళసూత్రం తీయబోయినవాళ్ళని ఆమె రక్కి-గిల్లి వాళ్ళపైన వెయ్యి శాపనార్థాలు ద్రిమ్మరించింది. చేతుల్లోంచి గాజులు తీయబోయిన ఒక పూర్వసువాసినిని కాలువలో పడత్రోసింది. రేవు దగ్గరి నుంచి ఇంటికి పారిపోయి గదిలో గడియవేసుకుని పడుకుంది.

రాత్రంతా ఎందరో తలుపు తీయమని ప్రాధేయపడ్డారు. కూతుర్ని పిలిచీ పిలిచీ అలసిపోయి కామాక్షమ్మ తలుపు దగ్గరే పడుకుని నిద్ర పోయింది. భళ్ళున తెల్లవారేసరికి గదిలో చడీ చప్పుడూ లేవు. గునపాలు తెచ్చి తలుపును పగలగొట్టవలసి వచ్చింది.లోపల అన్నపూర్ణ లోక వ్యవహారాలతో తన కేమాత్రం సంబంధం లేనట్టు నేలపైన పడుకునివుంది.కదిలించి చూచారు. లేపి కూచోబెట్టారు. పట్టుదప్పగానే మేను మళ్ళీ నేలపైనే పడి పోయింది. వెళ్ళినవాళ్ళు పెదవి విరచి,నిట్టూర్పు వదలి బయటికి వచ్చేశారు. నుదుట కుంకుమ తిలకంతోనే, మెడలో మంగళసూత్రంతోనే అన్నపూర్ణ భర్తని వెదుక్కుంటూ వెళ్ళిపోయింది.

* * *

నాలుగేళ్ళ ప్రాయాన్నే తల్లిదండ్రుల్ని గోల్పోయిన దురదృష్టజాతకుడు రఘు అమ్మమ్మతో గూడా మామ గారిల్లు చేరాడు.

ఆ బుడుతడి రాకపట్ల కృష్ణమూర్తి కుటుంబంలో ఆసక్తి కనబరిచిన వారెవరూ లేరు. రఘు చుట్టపు చూపుగా వచ్చి నాలుగు రోజు లుండిపోయే వాడైతే ఆ సంగతి వేరు. అతణ్ణిక ఎల్లకాలమూ ఈ కుటుంబమే భరించవలసి ఉంటుంది. ఇలాటి ఆలోచనవల్ల ఉత్పన్నమయిన ఉదాసీనభావమే రఘుకు ఆ ఇంట్లో స్వాగతం పలికింది.

కృష్ణమూర్తికి అత్తగారి వైపున చెప్పుకోదగ్గ బంధు బలగముంది. పరస్పర వయోగుణ భేదాలతో అతనికి మరదండ్లే ఏ డెనిమిది మంది వున్నారు. ఆ ఏడెనిమిది మందిలో హైస్కూలు చదువుకోసం కృష్ణమూర్తి యింట్లోనే వున్న ఇద్దరుగాక, మిగిలిన వాళ్ళల్లో సైతం ఏ ఒకరిద్దరో అక్కడే వుండి చీరలు బేరం చేయడంలోనూ, చాకలి పద్దులు వ్రాయడం లోనూ అక్కగారికి తోడ్పడుతుంటారు. ఇంట్లో ఆ మూలనుంచీ ఈ మూల వరకూ చెడతిరుగకుండా ముచ్చటగా కుర్చీలో కూచుని కావలసిన వస్తువులు తెమ్మని నౌకర్లకు హుకుం జారీచేయడం ఆ అక్కచెల్లెళ్ళకు చిన్నప్పటినుంచీ

అలవాటయిన సుగుణాల్లో ఒకటి. ఇంట్లో 'మంది' హెచ్చినకొద్దీ నౌకర్లను హెచ్చించడానికీ, కృష్ణమూర్తి పొదుపరితనానికి పొత్తు కుదరకపోవడంచేత ఆ అక్కచెల్లెళ్ళకు కాలిపనీ చేతిపనీ చేసిపెట్టడానికి రఘు చక్కగా వుపకరించాడు.

కామాక్షమ్మ ఓ మంచిరోజు చూచి పలకాబలపం కొనిపెట్టి రఘుని పొరుగింటి పిల్లలతో బాటు బడికి పంపించింది. ఆ సాయంత్రం అతడింటికి రాగానే దగ్గర కూర్చోబెట్టుకుని "ఏదీ బాబూ! ఈ రోజు ఏం నేర్చుకున్నావో వ్రాయి" అంది. రఘు పలకనిండుగా 'ఓనమఃలు' వ్రాసి సగర్వంగా అమ్మమ్మ ముఖంకేసి చూచాడు. కామాక్షమ్మ మనవణ్ణి ఒడిలో పడుకో బెట్టుకుంటూ "నా బాబుకి చదువెందుకు రాదు! వాడికే రాకపోతే ఆ చదువింకెవరికి వస్తుంది" అంటూ పరవశించిపోయింది.

తన పర్యవేక్షణక్రింద రఘు చదువు నిరభ్యంతరంగా సాగిపోగలదని కామాక్షమ్మ భావించింది. కానీ ఆమె కోరిక సఫలం కావడానికి ఆ ఇంట్లో అనేక ప్రతిబంధకాలు ఏర్పడసాగాయి.

ఓ రోజు ఉదయం కామాక్షమ్మ తోటలోకి వెళ్ళి దేవతార్చనకోసం పూలు కోసుక రావడంలో కొంచెం ఆలస్యమయింది. తిరిగివస్తూ, ఆమె ఆ పాటికి రఘు బడికి వెళ్ళిపోయి వుంటాడనుకుంది. కానీ అలా జరుగలేదు. సావిట్లో రఘు పలకా పుస్తకాలు అలాగే వున్నాయి. బడికిపోకుండా వీడింకా ఇంట్లో ఏంచేస్తున్నట్టు అనుకుంటూ ఆమె ఇల్లంతా వెదుకసాగింది. రఘు మేడమెట్ల దగ్గర స్లిప్పర్సును తుడిచి, పాలిష్ వేస్తూ ఆమెకు ప్రత్యక్షమయ్యాడు.

"అదేమిట్రా! బడి మానేసి చెప్పులు తోముకుంటున్నావు" అని విస్తుపోయింది కామాక్షమ్మ.

"ఇవి నిర్మలత్తయ్య స్లిప్పర్లు అమ్మమ్మా! బాగా తోమిపెట్టమంది" అన్నాడు రఘు.

కామాక్షమ్మ కోపంతో ఆపాదమస్తకమూ కంపించిపోయి "నిర్మ

లత్తయ్య చెప్పులు తోమి పెట్టమంటుంది. కమలత్తయ్య బట్టలుతికి పెట్ట మంటుంది. లీలత్తయ్య నీళ్ళు కాచమంటుంది. ఇంకొక రింకొక పనిచేయ మంటారు. ఐతే నువ్వీ అరవచాకిరీ చేస్తూ బడి మానుకుంటావట్రా?" అంది.

ఏదో పనిమీద ఆవైపు వచ్చిన ఇంటి యిల్లాలు ఆ విషయంలో స్వయంగా కలుగజేసుకుంటూ, "మరేం ఫరవాలేదులే అత్తయ్యా, ఒకరోజు బడి మానుకున్నంత మాత్రంలో మీ మనవడి చదువు పాడైపోదులే" అంది.

"ఇక్కడ నిన్నెవరు మాట్లాడించారమ్మా?" అంటూ కామాక్షమ్మ ముఖం మరోవైపుకు తిప్పుకుంది.

"మాట్లాడించకపోయినా అవసరం వచ్చింది గనుక చెబుతున్నాను. మీ మనవణ్ణి ఒక దొరగారిలా చూసుకోవలసిన అవసరం మాకేమీ కని పించడంలేదు. వాడి కిక్కడ రాచరికపు మర్యాదలు జరగాలంటే అదెలా కుదురుతుంది?" అంటూ ఒక విసురుతో గృహిణి లోపలికి వెళ్ళిపోయింది.

కామాక్షమ్మ అభిమానం కలిగిన మనిషి. భర్తదగ్గరకూడా ఆమె ఒకమాట పడి ఎరుగదు. తనపట్ల కోడలు చూపిస్తున్న నిర్లక్ష్యమూ, మన వడిపైన ఆ యింట్లో అందరూ నెరపుతున్న అధికారమూ తలచుకొన్న కొద్దీ ఆమె మనసు పరిపరివిధాల పోయింది. నిజానికీ యింటికి రఘు పరాయివాడేంకాదు. ఇక్కడ వాడికి కాకపోతే మరెవరికి జరగాలి రాచరికపు మర్యాదలు! మర్యాదల సంగతి దేవు డెరుగు. వేళకు పట్టెడన్నానికైనా పెట్టి పుట్టలేదా! ఆదిలోనే యిలా హంసపాదైతే, యింక రఘు బ్రతుకేం కావాలి! అబ్బే. తన కట్టె వుండగా అలా జరగడానికి వీల్లేదు.

కామాక్షమ్మ ఆరోజు సాయంత్రమే కుమారుడిదగ్గర మెల్లగా ఈ విషయాన్ని ప్రస్తావించింది. "ఒరే బాబూ! మీ ఆవిడతో చెప్పు. వాడు కాలంగార ఈ యింట్లో పడివున్నాడు. అందరిలా వాడికీ తల్లీ దండ్రీ వుంటే వాడు మారాజులా బ్రతికేవాడే. వాడికి మీరేమీ సిరిసంపదలు తలపై కెత్తవలసిన అవసరంలేదు. పట్టెడు తిండి పెట్టండంతే! వాణ్ణి చదువుకో నివ్వండి. ఏదో వాడి బ్రతుకు వాడు బ్రతుక్కుంటాడు" అంటూ సంగ్ర హంగా తన హృదయావేదన వెలిబుచ్చుకుంది.

కృష్ణమూర్తి తల్లిమాటలు తనకేమీ అర్థంకానట్టు తెల్లబోయి "అదేమిటమ్మా! ఇప్పుడు వాడికి మేము తిండి పెట్టడంలేదంటావా?" అన్నాడు.

"తిండి సంగతలా వుండనీ! వాడిని బడికి వెళ్ళనీకుండా చెప్పులు తోమి పెట్టమనడం నీ కిష్టంగావుందా-చెప్పు" అని నిలదీసి ప్రశ్నించింది కామాక్షమ్మ.

"చెప్పులు తోమితే నీ మనవడు అరిగిపోతాడనుకుంటున్నావా అమ్మా! కృష్ణమూర్తంటూ ఒకడు కాస్తా సిరిసంపదలతో బ్రతుకుతున్నాడు కాబట్టి సరిపోయిందిగానీ, లేకుంటే నీ మనవడు నిజానికి బూట్‌పాలిష్ చేసుకుంటూ బ్రతకాల్సిందే! వాడిని గురించి నువ్వింత పట్టింపు పెట్టుకుంటే ఏం బావుంటుంది, అమ్మా! ఇదేం బావుండలేదు. ఎప్పటికయినా యిది చిక్కే. ఈ చిక్కును ఆదిలోనే విడిపించుకోవాలి. వాడి నెక్కడైనా అనాథ శరణాలయంలో చేర్చేయడం మంచిది."

కామాక్షమ్మ ఎందుకో పకాలున నవ్వింది. నవ్వి "ఒరే బాబూ! ఆ మాట నీ నోటంట వచ్చినందుకు నవ్వాను. వాడిని అనాథల్లో చేర్చేయాలంటున్నావు. వాడి తండ్రి చనిపోయాడు. తల్లి చనిపోయింది. కానీ నేను చావలేదు, బ్రతికేవున్నాను. నేను బ్రతికున్నంతవరకూ వాడనాథకాడు. నీ కిష్టం లేకపోతే చెప్పు-వాడూ, నేనూ నీ యింట్లో నుంచీ వెళ్ళిపోతాము" అంది.

"పోయేవాళ్ళని ఎవ్వరాపగలరు?" అంటూ కృష్ణమూర్తి పైకి లేచి, గబగబా మేడమెట్లెక్కసాగాడు.

కామాక్షమ్మ ప్రశాంతమైన స్వరంతోనే "మంచి మాటన్నావురా బాబూ! నువ్విలా అన్నప్పుడు, యిక్కడ మాకేముంది! పోతాములే" అంది.

అన్నంతపనీ చేసింది కామాక్షమ్మ. మరునాడు తెల్లవారేసరికి ఆ యింట్లో అవ్వా మనవళ్ళు కనిపించలేదు.

* * *

కొడుకు ఆచూకీ తీయడానికి వీల్లేని దూరప్రాంతానికి వెళ్ళిపోయింది కామాక్షమ్మ. ఒక పట్టణానికి చేరువగా, తనకి సీతారామయ్యగారేనాడో చేసి

పెట్టిన చెవుల కమ్మలు అమ్మి ఒక చిన్న గుడిసె వేసుకుంది. మిగిలిన డబ్బుతో ఒక పాడిగేదె కొనుక్కుంది. రఘు మళ్ళీ బడిలో చేరాడు. కామాక్షమ్మ తెల్లవారుఝామున అయిదు గంటలకే లేచి దీపం వెలిగించి రఘుని లేపుతుంది. రఘు వాచకం చదువుకుంటూ వుండగా చెత్త తోసి, గుడిసెముందు కళ్ళాపు చల్లి, వచ్చీరాని ముగ్గులు రెండు వేసి, నీళ్ళకోసం బిందె తీసుకుని కాలువకు వెళ్తుంది. ఆమె తిరిగివచ్చేసరికి తెల్లగా తెల్లవారుతుంది. రఘు ఆపాటికి పళ్ళు తోముకుంటాడు. వాడికి చద్దన్నం పెట్టి, కామాక్షమ్మ పాలు పిండుకుంటుంది. క్రితంరోజు తట్టిపెట్టిన పిడకల్ని గంపలో వుంచుకుని తలకెత్తుకుని, కుడిచేతిలో పాలచెంబు తీసుకుని రఘు వెంటరాగా, పట్టణంలోకి బయల్దేరుతుంది. మార్కెట్టు రోడ్డుదగ్గర ఇద్దరూ చీలిపోతారు. చర్చి రోడ్డు వెంబడే రఘు స్కూలుకి వెళ్ళిపోతాడు. కామాక్షమ్మ తను వాడుకగా పాలిచ్చేవాళ్ళ యిళ్ళకు వెళ్ళి పాలుపోసి ఎన్ని తవ్వలిచ్చిందో అన్ని ఎర్రటి చుక్కలు గోడపైనబెట్టి, తిరిగి యింటిదారి పడ్తుంది. త్రోవలో పిడకలు సైతం అమ్ముడుపోతాయి. చిల్లరగానైతే కానీకి ఆరు చొప్పునా, టోకుగా నయితే అణాకు ఇరవై అయిదు చొప్పునా పిడకలు అమ్ముడుపోయేవి.

ఐనా కామాక్షమ్మకు బ్రతుకు భారమనిపించలేదు. రఘు శ్రద్ధగా చదువుకుంటూ ప్రతి క్లాసులోనూ మొదటివాడుగా ప్యాసౌతూ వచ్చాడు. వాడు హైస్కూల్లో చేరిన రోజున కామాక్షమ్మకు మహదానందం కలిగింది. రఘు హెడ్మాస్టరు దగ్గరకి వెళ్ళి, తనకు అమ్మమ్మ తప్ప మరెవరూ లేరని మనవి చేసుకుని అర్ధజీతానికి సిఫారసు చేయించుకున్నాడు. ఐదు రూపాయలు పెట్టి, అన్నీ సెకండుహాండు పుస్తకాలే కొని వాటిని స్వయంగా బైండు చేసుకున్నాడు. కాలానికి పరుగెత్తడం సహజ గుణమైనా, స్కూలు జీవితంలో అదెవరికైనా మరింత వేగంతో పరుగెత్తినట్టు తోస్తుంది. రఘు హైస్కూల్లో చదువుకున్న ఆరేళ్ళు ఆరుక్షణాల్లో గడచిపోయాయి.

కామాక్షమ్మ అంతటితో తన బాధ్యత తీరిపోయినట్టు భావించలేక పోయింది. రఘు కాలేజీలో చేరి కనీసం బియ్యే అయినా పూర్తిచేయాలి. అంత మాత్రం చదువులేకపోతే ఈరోజుల్లో చెప్పుకోదగ్గ ఉద్యోగం దొరకడం లేదు. నా అన్నవారు తృణీకరించి దూరంచేసినవాడు రఘు. తన తల్లితో బాటు రక్తం పంచుకుని పుట్టిన మేనమామ దృక్పథంలో బూట్సులు పాలిష్ చేయవలసినవాడు. అనాధల్లో కలసిపోవలసినవాడు రఘు. అలాటి రఘు ఆ మేనమామ తలద్రొక్కినట్టు తాశీల్దారు కావాలి! అడ్వొకేటు కావాలి! ఇంకా మాట్లాడితే కలెక్టరు కావాలి! అంతకంటే ఉన్నతోద్యోగాలు కామాక్షమ్మకు స్ఫురించలేదు.

గవర్నమెంటు స్కాలర్‌షిప్పుతో కాలేజీ చదువు ముగించి. రఘు ఉద్యోగవిషయంలో మాత్రం అమ్మమ్మకు కొంచెం ఆశాభంగాన్నే కలిగించాడు. రఘూ దెప్పుడూ మనుషులతో కలిసిపోయే కలుపుగోలు స్వభావం. కాగితాలపైన రాతకోతలు చేసుకుంటూ కాలం గడిపివేయడం అతడి మానసిక ప్రవృత్తికి నచ్చలేదు. అందుచేత అతడు ఏరీ కోరీ తను చదివిన కాలేజిలోనే లెక్చరరు ఉద్యోగం స్వీకరించాడు.

ఉద్యోగం దొరికిన తర్వాత రఘు జీవితం సాఫీగా గడచిపోసాగింది. కాపురాన్ని గుడిసెలోనుంచీ తన హోదాకి తగినట్టు ఒక చిన్న మేడలోకి మార్పించాడు. వంటచేసి పెట్టడానికొక వంటలక్కని కుదుర్చుకోమని కూడా అమ్మమ్మకి సలహా ఇచ్చాడు. కానీ కామాక్షమ్మ మాత్రం ససేమిరా అలాటి పని జరగ్గూడదంది. "బుద్ధి తెలిసినప్పటినుంచీ చెమటోడ్చి, ఎముకలు విరిచి, నజ్జుగుజ్జయిన కట్టెరా బాబూ! ఇదింకా పదేండ్లపాటు పనికొస్తుందిలే, ఆపైన పెట్టుకొందువుగానీలే వంటలక్కను" అందామె.

"అదేమిటే అమ్మమ్మా! పదేళ్ళ తర్వాత గూడా వంటలక్క ఎందుకు? నన్నొక ఇంటివాణ్ణిగా చేసే ఉద్దేశం ఇప్పుడప్పుడే నీకు కలిగేట్టు లేదే!" అంటూ నవ్వాడు రఘు.

"కాలం కలిసి రావాలిరా బాబూ! అంతా దేవుడి దయ" అంది కామాక్షమ్మ.

కామాక్షమ్మ ఆశించినట్టు కాలం కలిసి వచ్చింది. అనతికాలంలోనే రఘు జీవిత కావ్యంలో సరిక్రొత్త ఆశ్వాసం ప్రారంభమైంది.

ఓ రోజు సాయంత్రం రఘు కాలేజినుంచీ తిరిగివచ్చి "రేపు మనింటికొకరు రాబోతున్నారమ్మా! మనం ఆతిధ్యమివ్వాలి" అన్నాడు.

"ఏ స్నేహితుల్లో నాకు తెలియనివా రెవర్రా! పేరు చెప్పగూడదూ?" అంది కామాక్షమ్మ.

"స్నేహితుడు కాదులే అమ్మమ్మా! నువ్వు మరేం కోప్పడకుంటే చెబుతాను. రేపు రాబోయేదొక స్నేహితురాలు."

"స్నేహితురాలా! అదెవర్రా బాబూ!" అంటూ నివ్వెరపోయింది కామాక్షమ్మ. రఘు టెన్నిసురాకెట్ గాల్లో ఊపుకుంటూ, నవ్వుతూ వెళ్ళిపోయాడు. కామాక్షమ్మ మాత్రం రాబోతున్న రఘుస్నేహితురాల్ని గురించి ఆలోచించుకుంటూ తలుపు దగ్గరే కూర్చుండిపోయింది.

మరునాటి ఉదయం రఘు పని గట్టుకుని అమ్మమ్మతో సహా వంట గదిలో కూచున్నాడు. "విందు దివ్యంగా వుండాలి అమ్మమ్మా! వంకాయలు కూర చెయ్. చిక్కుడు కాయలు వేయించు. మజ్జిగ తిరగబోత పెట్టు. శ్రమ అనుకోకుండా, పాయసం...."అంటూ అమ్మమ్మ కెక్కడ కోపం వస్తుందో నని ఆగాడు.

కామాక్షమ్మకు కోపం రాలేదు.జంకుతున్న మనవణ్ణి చూచి నవ్వుతూ ఆవిడ "ఇంతకూ ఆ వచ్చేది ఏవూరి దొరసానిరా?" అంది.

"దొరసానేమరి!తినబోతూ రుచులడగడ మెందుకు? నువ్వే చూద్దువు గానీ వుండు" అన్నాడు రఘు.

పదకొండు గంటలకు ఇంటి ముందు రిక్షా ఆగింది. చెంపకు చేరదేసి కళ్ళతో ఓ పిల్ల లేడిపిల్లలా అందులోనుంచీ బయటికురికి ద్వారం దగ్గర నిల్చునివున్న కామాక్షమ్మకు నమస్కారం చేస్తూ లోపలి కొచ్చింది. ఆ క్షణాన కామాక్షమ్మలో చెలరేగిన భావాల్ని మాటల్తో వ్యక్తంచేయడం సులభసాధ్యంకాదు. అప్రయత్నంగా ఆమెలో అనురాగం ప్రవాహంలా

ఉప్పతిల్లి, ఆ ప్రవాహం అదృశ్యంగా ఆ అమ్మాయిని అభిషేకింపసాగింది. ఆమె చేతులు చాచి ఆ అమ్మాయిని కౌగలించుకోవాలని కూడా అనుకుంది. కొంతసేపు గడచిన తర్వాత ఆ అమ్మాయిపట్ల తన కెందుకిలాంటి అకారణ మైన అవ్యాజానురాగం కలిగిందో తెలియక కామాక్షమ్మ తెల్లబోయింది.

వచ్చిన అమ్మాయి నట్టింట్లో పరచిన చాపమీద శరీరం ముడుచుకుని ముచ్చటగా కూర్చుంది. ఆమె నెలా మాట్లాడించాలో తెలియక కామాక్షమ్మ నాలుగైదు క్షణాలపాటు ఊరుకుంది. ఒక పెళ్ళికాని అమ్మాయి ఇలా జంకు గొంకులు లేకుండా పొరుగింటికి రావడమనేది కామాక్షమ్మకు అనూహ్య మైన విషయం. అందువలన కలిగిన అబ్బురం ఒకవైపున అలా ఉండగానే ఆమె ఆ అమ్మాయి దగ్గరికి వచ్చి చాపపైన కూచుంటూ "చదువుకుంటు న్నావా అమ్మాయీ?" అని ప్రశ్నించింది.

"ఈ సంవత్సరమే కాలేజీలో చేరానండీ!" అంది ఆగంతుక యువతి.

"ఐతే మా రఘుకి శిష్యురాలివన్న మాట! అవునుకదూ!" అంటూ కామాక్షమ్మ మెల్లగా నవ్వడానికి ప్రయత్నించింది.

ఆ అమ్మాయి అవునన్నట్లు తల ఆడించి, అలమారానుంచీ ఒక పుస్తకం తీసి తిరుగవేయసాగింది.

"రిక్షాలో వచ్చావు. మీ యిల్లిక్కడికి చాలా దూరమనుకుంటాను" అంటూ మళ్ళీ ప్రారంభించింది కామాక్షమ్మ.

"ఇల్లు కాదండీ! హాస్టలు. నేను హాస్టల్లో వుండి చదువు కొంటున్నాను."

"ఐతే మీ దీవూరు కాదన్నమాట!"

ఇందుకు ప్రత్యుత్తరం రాకముందే స్నానంచేసి వచ్చిన రఘు "ఆకలౌతోందమ్మా. తరువాత తెలుసుకుందువు గానీలే వివరాలన్నీ" అన్నాడు.

కామాక్షమ్మ గదిలో పీటలువేసి అన్నం వడ్డించింది. గేస్తుతోబాటే అతిథికూడా భోజనానికి కూచుంది. కామాక్షమ్మ పదార్థాలు వడ్డిస్తూ "ఐతే

యింతవరకూ ఎక్కడ చదువుకున్నావమ్మాయీ?" అని మళ్ళీ సంభాషణ కుపక్రమించింది.

"గూడూరులోనే నండీ!"

"గూడూరులోనే! ఏంరా రఘు! ఐతే ఈ అమ్మాయిది మనూరేనన్న మాట!" కామాక్షమ్మకు నిజంగా చాలా ఆశ్చర్యమే కలిగింది.

"మీదికూడా గూడూరేనని నాకు చెప్పలేదేమండీ!" అంటూ ఆ అమ్మాయి సైతం రఘుని చూస్తూ ఆశ్చర్యం ప్రకటించింది.

రఘు బదులు చెప్పకుండా ఎంతో బుద్ధిమంతుడిలా వంటకాల రుచి చూస్తూ కూచున్నాడు.

"వా డెప్పుడూ అంతేలే అమ్మాయ్! చెప్పవలసింది తప్పా మిగిలిన వన్నీ చెబుతాడు. పోనీలే, గూడూరులో మీ యిల్లేవీధిలో వుంది?" అంది కామాక్షమ్మ.

"భజనగుడి వీధిలో నండీ!"

"భజనగుడి వీధిలోనే! అమ్మాయ్, అంతకంతకూ దగ్గరదానివై పోతున్నావు. మీ నాన్నగారి పేరు?"

"కృష్ణమూర్తిగారు."

కామాక్షమ్మ చేతిలోనుంచి నేతిగిన్నె జారి ఠకీమని క్రిందపడింది. కానీ నెయ్యి నేలపాలు మాత్రం కాలేదు. అరపడి నేయి సీదాగా రఘు ఆకులో ఒలికిపోయింది.

"ఇంత నెయ్యి నేనేం చేసుకొనే అమ్మమ్మా?" అంటూ రఘు బిత్తర పోయి అమ్మమ్మవైపు చూచాడు.

కామాక్షమ్మ గరిటె క్రిందవుంచి రఘు ఆకులోవున్న నేతిలో సగం తీసి అమ్మాయి విస్తరిలో వేసింది.

"అదేమిటే అమ్మమ్మా, ఎంగిలి కదూ... ?" అంటూ విస్తుపోయాడు రఘు.

"మేనత్తకొడుక్కూ, మేనమామ కూతురికీ మధ్య ఎంగిళ్ళేం పని చేస్తవిరా బాబూ! ఇది రక్తసంబంధం, పొమ్మంటే పోతుందా?" అంది కామాక్షమ్మ.

ఆరోజు సాయంత్రం కామాక్షమ్మ మనవరాలికి తల దువ్వుతూ, "ఏమిటే అమ్మాయీ. నీకిప్పు డెన్నేళ్ళు?" 'అని అడిగింది.

"పదిహేడో ఏడు జరుగుతోంది బామ్మా!" అంది సుశీల.

"నేను రఘుతో యిల్లు విడిచిపెట్టినప్పుడు నువ్వు ఏడాది దాటని పసిదానివి. మేము యిల్లు విడిచి పధ్నాలుగేళ్లు కావస్తున్నాయి. ఇప్పుడు రఘుకి ఇరవై మూడేళ్ళు; నీకు పదిహేడేళ్ళు. మీ రిద్దరూ ప్రక్క ప్రక్కన నిలబడినప్పుడు చూచాను. నువ్వు వాడి భుజాలదాకా వస్తావు! నేనీ జన్మలో మీ నాన్న ముఖం చూడగూడ దనుకున్నాను. అంతెందుకూ! నాకు కొడుకే లేడు పొమ్మనుకున్నాను. కానీ మనం అనుకోవడం ఏముంది? దేవుడు మరోవిధంగా అనుకున్నాడు" అంటూ సుశీల తల్లో పువ్వులు తురిమింది కామాక్షమ్మ....

రఘుకు, సుశీలకూ వివాహమైన తర్వాత కామాక్షమ్మకు తను జీవితంలో నిర్వహింపవలసిన కార్యభారాలన్నీ ఒక కొలిక్కి వచ్చినట్టు ఇటుపైన తనకు విశ్రాంతి మాత్రమే మిగిలినట్టు తోచింది. ఐనా గోళ్లు గిల్లుకుంటూ వృథాగా కాలం గడిపివేయడం ఆమె స్వభావానికి విరుద్ధం. లోకంలో మానవులు స్వతహాగా రెండు తరగతులుగా వుంటారు. మొదటి తరహా వారేమో ఇతరులపైన పెత్తనం చలాయించడానికి మాత్రమే బ్రతుకుతారు. రెండవ తరగతి వారేమో పిన్నలకూ, పెద్దలకు చాకిరీ చేయడంలోనే బ్రతుకు వెళ్ళబుచ్చుతారు. కామాక్షమ్మ రెండోవర్గానికి చెందిన మనిషి.

పెళ్లయిన తర్వాత నాల్గేళ్ళకు రఘుకి మరోవూరుకి ట్రాన్స్‌ఫరు వచ్చింది. ఆ వూళ్ళో రఘు అంతస్తు మరోమెట్టు పెరిగింది. అంతకు మునుపుండిన వూళ్ళో రఘుని చిన్నప్పటినుంచీ అందరికీ తెలుసు. కామాక్షమ్మ పిడకలమ్మి, పాలమ్మి రఘుని చదివించిన సంగతి వాళ్ళకు సుపరిచితం. క్రొత్త వూళ్ళో రఘు అందరికీ అపరిచితుడు. పైగా వరకట్నం తాలూకు వస్తు వాహనాలతో అతడు వాళ్ళకొక పిల్ల జమీందారులా కనిపిం

చాడు. అందుకుతోడూ సుశీల మహిళా సమాజంలో సభ్యురాలుగా చేరి తన మాటకారి తనంవల్ల దానికి కార్యదర్శి కాగలిగింది. కలెక్టరుగారి కూతుళ్లు, ప్లీడర్ల భార్యలు ఇంటికి రావడం పోవడం సాగించారు. వీథంట వెళుతున్న రఘుకి అడ్డు తగిలి నమస్కరించి కుశల ప్రశ్నలువేసేవారి సంఖ్య ఎక్కువైంది.

ఈ క్రొత్త వాతావరణం రఘుకి, సుశీలకి ఎంత ఆనంద ప్రదమయిందో అంతగా కామాక్షమ్మ ఆ క్రొత్త పరిస్థితుల్లో ఉక్కిరి బిక్కిరై పోయింది. పడకకుర్చీలో చేరగిలబడి తనతో తీరిగ్గా మాట్లాడ్డానికి రఘుకిప్పుడు వ్యవధి చిక్కడంలేదు. మహిళా సమాజపు కార్యకలాపాల్లో చిక్కుకున్న సుశీలకు రెండేళ్ళ చిట్టిపాపకు పాలివ్వడానికైనా అదను దొరకడం లేదు.

కొత్త పరిసరాలకు తగినట్టు నడచుకోవడం కామాక్షమ్మకు చేత కాలేదు. ఆమె తన అలవాటు ప్రకారం ఉదయం 5 గంటలకే లేచి యేటికివెళ్లి నీళ్ళు తెచ్చేది. ఆ తరువాత నీళ్ళు కాచి బిడ్డకు స్నానం చేయించి, గంప తీసుకుని ఊరి బయటికి వెళ్ళేది. గంప నిండుకూ చిదుగులు ప్రోగుచేసుకొని తిరిగి వచ్చేసరికి మధ్యాహ్నం దాటుతుంది. మధ్యాహ్న భోజనానంతరం కాసేపు మేనువాల్చి, ఆ తరువాత ట్రంకురోడ్డు వెంబడే నాలుగు ఫర్లాంగులు వెళ్ళి పేడగింజలు ప్రోగుచేసి తెచ్చేది.

సుశీల బొమ్మ చేస్తున్న పనులు చూచీ చూడనట్లు కొంతకాలం ఊరుకుంది. బినా ఎంతకాలమని ఓపిక? తమ అంతస్తుకీ, ఆమె చేస్తున్న పనులకూ ఎక్కడా పొత్తు కుదరడంలేదు. ఇంటి కెందరెందరో వస్తుంటారు, పోతుంటారు. వాళ్ళకీ విషయం తెలిస్తే ముఖం చాటుచేసుకుని నవ్వరూ? ఇకపైన నవ్వడమేమిటి, ఈపాటికి నవ్వుతూనే వుంటారు. కానీ తనందు కేం చేయాలి? అప్పటికీ ఒకసారి తీవ్రంగా మందలించిందికూడా. ఆ మందలింపు చెవిటికి శంకు ఊదినట్లే అయింది.

ఓ రోజు ఉదయం పెద్దపెద్ద కుటుంబాలనుంచీ నలుగు రైదుగురు స్నేహితురాండ్రు సుశీలకోసం వచ్చారు, వాళ్లు హాల్లోకూచుని బాతాఖానీవేస్తుండగా చిదుగుల గంపతో కామాక్షమ్మ ప్రత్యక్షమైంది.

మట్టుకు, మర్యాదకు కొంచెం యెడంగావుండే స్నేహితురా లొకతె "ఆ మనిషి యెవరే సుశీ?" అని ప్రశ్నించింది.

మరో విషయాన్ని ప్రస్తావించి అందుకు జవాబు చెప్పకుండా తప్పించుకో జూచింది సుశీల. కానీ స్నేహితురాలు మాత్రం ఆ విషయం మరిచి పోలేదు.

"మీ ఇంట్లో ఎన్నోసార్లు చూచాను, పనిమనిషా ఏమిటి సుశీ!" మళ్ళీ ప్రశ్నించిం దావిడ.

"అవును" అంది సుశీల మరేం చెప్పడానికీ మనస్కరించక!

చిదుగుల గంపతో పెరట్లోకి వెళుతున్న కామాక్షమ్మ నఖశిఖ పర్యంతం షాక్ తగిలినట్లయి, గంప నొకమూలకు విసరి కుప్పకూరలా నేలపైన కూలబడిపోయింది. మధ్యాహ్నమై, ప్రొద్దు పడమరకు వ్రాలింది. వంటలక్క ఒకటి రెండుసార్లు భోజనానికి పిలిచినా కామాక్షమ్మ అక్కడి నుంచి కదల్లేదు.

సాయంత్రం ఐదుగంటలకు రఘు కాలేజీనుంచి వచ్చి "అదేమిటే అమ్మమ్మా, అలావున్నావు?" అని అడిగాడు.

"ఏం చెప్పన్రా బాబూ! నీకైతే నేను ఇంకా అమ్మమ్మలా కనిపిస్తున్నాను, అది నా అదృష్టం! నీ భార్యపాలిటి కేమో నేను పనిమనిషినై పోయాను" అంటూ పమిట చెరగుతో ముఖం కప్పుకుంది కామాక్షమ్మ.

రఘు ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్టు పోజుపెట్టి హాల్లో పచారు చేయసాగాడు. ఏడుగంటలకు సుశీల క్లబ్బునుంచి తిరిగివచ్చి "అదేమండీ, ఏం జరిగిందని అలా విచారంగా వున్నారు?" అంది.

"ఇలారా సుశీ!" అంటూ రఘు లైబ్రరీ గదిలోకి వెళ్ళాడు.

కామాక్షమ్మ కెప్పుడూ పొంచి వినే వాడుకలేదు. ఐనా ఆరోజు మాత్రం మనమడు భార్యనెలా మందలిస్తాడో వినాలని బుద్ధిపుట్టి లేచివెళ్ళి హాల్లో నిల్చుంది.

భర్త భార్యని మందలిస్తున్నాడు: "అమ్మమ్మ నేమన్నావు సుశీ! ఆమె చూడు ఎలా ఖిన్నురాలై కూచుందో."

"ఏం చేయమంటారండీ? ఆమె చేసేవన్నీ నామర్దాపనులు. అక్కడికీ నా అంతట నేనే ఆమె పనిమనిషని చెప్పలేదు. ఆ శ్యామసుందరరావు గారి భార్య అడిగితే, మరేం చెప్పడానికీ తోచక అవునన్నాను."

"ఆ అనడ మేదో అమ్మమ్మకి వినబడకుండా అనరాదా సుశీ!"

కామాక్షమ్మ గిరుక్కున వెను దిరిగింది. ఐతే భార్య తనని పని మనిషిగా వ్యవహరించడంలో వీడికభ్యంతరం లేదన్నమాట! ఆ అనడమేదో యీ ముసలిదానికి వినబడకుండా చెప్పుకోవాలంతే! యింతకంటే దగా లోకంలో ఉండదు. దాదాపు ఇరవైయేళ్లు తను సర్వసౌఖ్యాల్నీ విడనాడుకుని వీడిని సాకి సంతరించి విద్యాబుద్ధులు నేర్పినందుకు ప్రతిఫలంగా వీడు తను తన పరోక్షంలో పనిమనిషిగా వ్యవహరింపబడడానికి అంగీకరిస్తున్నాడు. ఈ ఇరవైయేళ్ళు తను భగవంతుడికి సేవచేసివుంటే ఈ పాటికి ముక్తి లభించి వుండేదేమో! మనుషుల్ని నమ్మి తనకంటే మోసపోయిన వాళ్ళు మరొకరుండరు. ఛీ! ఏం లోకం, ఏం మనుషులు!

ఆరాత్రి రఘుకి, సుశీలకి మామూలుగానే గడచిపోయింది, ఆ నిశీధం తమనుంచీ ముసలావిడని వేరుచేసిందన్న విషయం వాళ్ళకి తెల్లవారిన తర్వాతగానీ తెలిసిరాలేదు.

*　　*　　○

మందమారుతం స్థానే చలిగాలి వీస్తోంది. ఆకాశాన దూదిపింజల్లాంటి మబ్బులు నడయాడుతున్నాయి, వెన్నెల మసకబారిపోతోంది. రాత్రి బాగా మీరిపోయేదాకా ఆవేళ కామాక్షమ్మ జీర్ణకుటీరంలో వంటపూర్తికాలేదు. ఒకసారి ఆమె బయటికివచ్చి "ఏంరా రఘూ! ఆకలౌతోందా?"అని అడిగింది. రఘు "లేదులే అమ్మమ్మా!" అన్నాడు. "ఏం చేయమంటావు రఘూ! మమకారం తెగిపొమ్మంటే తెగిపోయేదా! నాకు చిన్నప్పటినుంచీ ఒక కోరికుండేది, ఈరోజు నీతో చెబుతున్నాను. ఇంటినిండుగా చుట్టాలు రావాలి, నేను స్వయంగా వంటచేసి వడ్డించాలి, చిన్నా, పెద్దా, పిల్లాజెల్లా తింటుంటే చూడాలి అనుకునేదాన్ని. భగవంతుడు నా కోరికలన్నీ నెరవేర్చాడు. అది

మాత్రం తీరకనే ఉండిపోయింది. ఎవరెవరి అదృష్టం ఎప్పుడు పండుతుందో ఎవరు చెప్పగలరు! వెంకటేశ్వరుడు మిమ్మల్ని ఈరోజు నా దగ్గరికి తీసుకొచ్చాడు. మీరు ముగ్గురూ కూచుంటే ఈ పాక నిండిపోతుంది. అప్పడాలు వేయిస్తున్నాను. నువ్వులేచి కాళ్ళుచేతులు కడుక్కో" అంటూ కామాక్షమ్మ లోపలికి వెళ్లిపోయింది.

తెల్లవారింది. రఘు సతీసుతలతో ప్రయాణమై గుడిసె ముందు నిలుచున్నాడు. కామాక్షమ్మ కళ్ళ నీళ్ళు పెట్టుకోకుండానే లక్షణంగా భార్యాభర్తల్ని సాగనంపాలనుకుంది. కానీ పొంగి పొరలిపోతున్న నీటి కడ్డంగా కట్ట ఎంతకాలం నిలబడగలుగుతుంది! ఆమె చిట్టిపాపని మళ్ళీ ఒకసారి చేతుల్లోకి తీసుకుంటూ "ఇదంతా యెలా వుందో చూశావా రఘూ! శ్రీరాముడు శబరి ఇంటికి వచ్చాడని చెబుతారు. అలావుంది. మీరు వెళ్ళిపోతున్నారు. నేనేం చెయ్యను! పువ్వుల వ్యాపారంలో ఏం మిగుల్తుంది! అక్కడక్కడికే సరిపోతుంది. ఈ రెండేళ్ళుగా నేను మిగిల్చిందల్లా ఈ కొంగులోనే ఉంది. ఊరు పొమ్మంటూ, కాడు రమ్మంటూన్న కాలంలో నాకీ బరువెందుకు! తీసుకెళ్లు. దీంతో మరేం పెద్ద నగ రాదు. పాపకు మువ్వల కడియాలును చేయించి కాళ్ళకు వేయించు. అది నడిచినప్పుడల్లా మువ్వలు ఘల్లు ఘల్లుమంటుంటాయి. అప్పుడల్లా మీకు నేను జ్ఞప్తి కొస్తుంటాను. ఈ ముసలి తనంలో నన్ను తలచుకునేవాళ్లు ఒకరిద్దరయినా వున్నారనుకోకుంటే నేను తృప్తిగా చావలేను" అంటూ కొంగుముడి విప్పి చిల్లర డబ్బుల్ని పాప ఒడిలో పోసింది.

రఘు అమ్మమ్మ దగ్గరనుంచి పాపని తీసుకున్నాడు. సుశీల బామ్మకు నమస్కరించి సెలవు తీసుకుంది. అంతకంతకూ దూరంగా వెళ్ళిపోతున్న ఆ సతీపతుల్ని చూస్తూ కామాక్షమ్మ ఆ గుడిసె తలుపు దగ్గరే నిలుచుండిపోయింది. *